

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 20-05-2026 | సంపుటి - 27 | సంచిక -357 | రూ : 4 | పేజీలు: 8


నోట్ల కట్టలు...

## నగల గుట్టలు



- జలమండలి జీఎం కుమార్ ఇంట్లో భారీ సంపద
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు
- రూ.1.10 కోట్ల నగదు స్వాధీనం
- 2 కిలోల బంగారు, 9 కిలోల వెండి ఆభరణాలు...
- ఖరీదైన ఇళ్ల స్థలాలు, భూముల దస్తావేజులు లభ్యం
- అన్నింటి విలువ రూ.5.88 కోట్లుగా గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా 2లో



## పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యం

- వేగంగా భూసేకరణ పూర్తిచేయండి
- నిధుల విడుదలలో జాప్యం ఉండదు..
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఉమ్మడి జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణనూ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. ఈ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో సీఎం మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులపై సమీక్షించారు. భూసేకరణకు నిధుల విడుదలలో జాప్యం జరగకుండా చూస్తామని హామీఇచ్చారు. ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులనూ చెల్లిస్తామని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రులను ఆదేశించారు.

### గ్రీన్ ఛానల్ ద్వారా నిధులివ్వాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల భూసేకరణకు తరువాయి 2లో

మౌనం వీడిన షేక్ హసీనా..

## స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధం!

- తన దేశం కోసం పోరాడుతూనే ఉంటానన్న హసీనా
- తన దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని వ్యాఖ్య
- భారత్ – బంగ్లాదేశ్ మధ్య ఉన్న బంధం చారిత్రకమైనదన్న హసీనా 2లో





ట్రంప్, నెతన్యాహులను చంపితే రూ.559 కోట్లు..

## ఇరాన్ భారీ స్కెచ్! 2లో

- సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం
- అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్‌నూ టార్గెట్ చేసిన ఇరాన్
- కాల్పుల విరమణ ఒప్పందానికి విఘాతం కలిగే అవకాశం



2లో

మమతకు ఎదురుదెబ్బ..

## రేసు నుంచి తప్పుకున్న సొంత నేత!

- ఫాల్టా అసెంబ్లీ రీ-పోలింగ్‌కు మరో రెండ్రోజులు
- టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ పోటీ నుంచి విరమణ
- భవిష్యత్తులో కూడా ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటన
- మమత మేనల్లుడు అభిషేక్‌కు జహంగీర్ సన్నిహితుడు

హైదరాబాద్ రియాల్టీ ధూమ్..

## ఆల్ టైమ్ రికార్డుకు చేరిన ఆఫీస్ మార్కెట్!




- తొలి త్రైమాసికంలో 31.5 లక్షల చ.అ. ఆఫీస్ స్థలం లీజింగ్
- గతేడాదితో పోలిస్తే 21.6 శాతం వృద్ధి నమోదు
- మొత్తం లీజింగ్‌లో మాదాపూర్ వాటానే 91 శాతం
- కొత్త సరఫరా లేకపోవడంతో తగ్గిన ఖాళీలు.. పెరిగిన అద్దెలు
- ఐటీబీపీఎం, ఫ్లెక్సిబుల్ వర్క్ స్పేస్‌ల నుంచే అధిక డిమాండ్ 2లో



భారత ఇంధన రంగానికి

## లభించిన పెద్ద ఊరట

- సముద్రంలో చిక్కుకున్న రష్యా చమురు కార్గోలకు అమెరికా 30 రోజుల లైసెన్స్ జారీ
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ వంటి దేశాలకు తాత్కాలిక ఊరట 2లో

నార్వే జర్నలిస్టుకు

భారత విదేశాంగ శాఖ

## గట్టి జవాబు

- ప్రధాని మోదీ నార్వే పర్యటనలో చెలరేగిన వివాదం
- ప్రశ్నలు పట్టించుకోకుండా వెళ్లారంటూ మోదీపై జర్నలిస్ట్ విమర్శ
- విదేశాంగ శాఖ బ్రీఫింగ్‌లో భారత ప్రజాస్వామ్యంపై జర్నలిస్ట్ ప్రశ్నలు
- 'కోర్టుకు వెళ్లండి' అంటూ ఘాటుగా బదులిచ్చిన భారత అధికారి
- సోషల్ మీడియాలో వైరల్ అయిన దౌత్యాధికారి సమాధానం 2లో



# పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యం

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఉమ్మడి జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణనూ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. ఈ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో సీఎం మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులపై సమీక్షించారు. భూసేకరణకు నిధుల విడుదలలో జాప్యం జరగకుండా చూస్తామని హామీఇచ్చారు. ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులనూ చెల్లిస్తామని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రులను ఆదేశించారు.

**గ్రీన్ ఛానల్ ద్వారా నిధులివ్వాలి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రూ.480 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ నిధులను నేరుగా (గ్రీన్‌ఛానల్ ద్వారా) ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయగా. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రధాన కాలువల పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొనగా... అందుకు అవసరమైన భూసేకరణ, నిధులపై ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం సూచించారు. ఈ అంశంపై ఈ నెల 25న నాగర్‌కర్నూల్, 26న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎత్తిపోతల్లో చేపట్టకుండా పక్కనపెట్టిన లక్ష్మీదేవిపల్లి జలాశయాన్ని నిర్మించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కోరినట్లు తెలిసింది. కర్వెన జలాశయం కింద ప్రధాన కాలువను నిర్మిస్తే కోయిల్‌సాగర్ వరకు సాగునీరు అందుతుందని, దీని కిందనే ఎక్కువ ఆయకట్టు ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే అసంపూర్తి పనులన్నీ పూర్తవుతాయని, అలానే శంకరసముద్రం జలాశయం ఆర్‌అండ్‌ఆర్ పనులు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకంలో మరో 10 శాతం భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల్లోని మొదటి దశ పంప్‌హౌస్‌లో మూడు మోటార్లే నడుస్తున్నాయని, మరో రెండింటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. 2028 డిసెంబరు నాటికి 'పాలమూరు రంగారెడ్డి' పూర్తయ్యేలా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, వి.శంకరయ్య, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

- **పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతాం : ఉత్తమ్**

భారాస పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అక్కడి ప్రాజెక్టుల్లో పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పక్షం రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల్లో పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ హాజరయ్యారు. పాలమూరు రంగారెడ్డి పనులు 90 శాతం పూర్తయ్యాయంటూ భారాస నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా సత్యదూరం. వారి పాలనలో ఈ ప్రాజెక్టుకు నీళ్లను తీసుకునే ప్రాంతాన్ని జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి మార్చడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. భూసేకరణ జరపకుండానే పిల్ల కాలువల వ్యవస్థ నిర్మాణానికి టెండర్లు పిలిచి నాడు చేతులు దులుపుకొన్నారు. ఈ పథకాన్ని ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తాం. మొదట ఆరు జిల్లాల్లోని 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తాం. పూడికతో నిండి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన జూరాల జలాశయాన్ని పునరుద్ధరిస్తాం. సంబంధిత ప్రతిపాదనలను కేంద్రానికి పంపాం. చెరువుల్లో వానాకాలానికి ముందే పూడికతీస్తాం'' అని వివరించారు.

## ట్రంప్, నెతన్యాహులను చంపితే రూ.559 కోట్లు.. ఇరాన్ భారీ స్కెచ్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను హత్య చేసిన వారికి 58 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.559 కోట్లు) భారీ బహుమతిని ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అక్కడి పార్లమెంట్‌లో ఒక వివాదాస్పద బిల్లుపై త్వరలోనే ఓటింగ్ జరగనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ ఇబ్రహీం అజీజీ ఈ బిల్లుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించినట్లు పేర్కొన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగానే ఇరాన్ ఈ సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ మరణానికి కారణమైన ట్రంప్, నెతన్యాహులతో పాటు అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌లను కూడా టార్గెట్ చేయాలని ఇరాన్ పార్లమెంట్ భావిస్తున్నట్లు సమాచారం. ఏ వ్యక్తి లేదా సంస్థ అయినా వీరిని చంపితే ఈ భారీ మొత్తాన్ని బహుమతిగా ఇస్తామని బిల్లులో పొందుపరిచారని తెలుస్తోంది. ఇప్పటికే ఇరాన్‌కు చెందిన కొన్ని సంస్థలు, 'హండాలా' అనే సైబర్ హ్యాకింగ్ గ్రూపులు కూడా ట్రంప్, నెతన్యాహులపై విడివిడిగా 50 మిలియన్ డాలర్ల రివార్డులను ప్రకటించాయి. ఇప్పుడు ఏకంగా ఇరాన్ పార్లమెంటే చట్టబద్ధంగా ఈ నగదు బహుమతి బిల్లును తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఇరుపక్షాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి ఈ పరిణామం విఘాతం కల్పించే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మౌనం వీడిన షేక్ హసీనా.. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధం!

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. 2024లో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా తన పదవిని కోల్పోయి, ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న ఆమె, తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. తనకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినప్పటికీ, తన పార్టీ అయిన 'అవామీ లీగ్' పై నిషేధం విధించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని ప్రకటించారు. "నేను బంగ్లాదేశ్‌లో లేనంత మాత్రాన సైలెంట్‌గా ఉన్నానని అనుకోవద్దు. దేశం కోసం నేను నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. అతి త్వరలోనే నేను మళ్లీ నా సొంత దేశానికి తిరిగి వెళ్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా తాను దేశానికి తిరిగి వెళ్లే నిర్దిష్ట తేదీ, సమయాన్ని ఇప్పుడే వెల్లడించలేనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ హక్కులు, చట్టబద్ధమైన పాలన పునరుద్ధరించబడటమే తన ప్రాథమిక లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తన పార్టీ 'అవామీ లీగ్'పై విధించిన నిషేధంపై ఆమె ఘాటుగా స్పందించారు. "అవామీ లీగ్ అనేది ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ. కేవలం ఒక ప్రభుత్వ కాగితపు ఆర్డర్‌తో దానిని క్లోజ్ చేయడం ఎవరి తరం కాదు. అదే నిజమైతే అసలు బంగ్లాదేశ్ అనే దేశమే పుట్టేది కాదు" అని గుర్తుచేశారు. గతంలో తనపై 19 సార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని, అయినా తాను ఎన్నడూ భయపడలేదని, ఇప్పటికీ లక్షలాది మంది మద్దతుదారులు పార్టీ కోసం నిలబడే ఉన్నారని చెప్పారు. గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన ముహమ్మద్ యూనుస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనుస్ ప్రభుత్వం అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై పగబట్టి 'రాజకీయ నరమేధం' సృష్టించిందని ఆరోపించారు. ఇప్పటివరకు తమ పార్టీకి చెందిన సుమారు 600 మందిని దారుణంగా హత్య చేశారని, 1.5 లక్షల మందికి పైగా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనగానే నాయకులంతా మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. భారతదేశంతో ఉన్న సంబంధాల గురించి ఆమె మాట్లాడుతూ.. "భారత్ - బంగ్లాదేశ్ మధ్య ఉన్న బంధం చారిత్రకమైనది. భారత్ కేవలం మా పొరుగు దేశం మాత్రమే కాదు, 1971 మా దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆ దేశం అందించిన సహకారం మరువలేనిది" అని కొనియాడారు. అయితే బంగ్లాదేశ్‌లోని కొన్ని రాజకీయ, తీవ్రవాద గ్రూపులు స్వార్థ ప్రయోజనాల కోసం భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు.

## మమతకు ఎదురుదెబ్బ.. రేసు నుంచి తప్పుకున్న సొంత నేత!

పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గ రీపోలింగ్‌కు కేవలం రెండు రోజుల ముందు అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ అభిషేక్ బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన జహంగీర్ ఖాన్ మంగళవారం సంచలన ప్రకటన చేశారు. తాను ఈ ఉపఎన్నికలో పోటీ నుంచి వైదొలగుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని స్పష్టం చేశారు. మమతా బెనర్జీ మేనల్లుడు ప్రాతినిధ్యం వహిస్తున్న డైమండ్ హార్బర్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఈ ఫాల్తా నియోజకవర్గ ప్రచారంలో టీఎంసీ అగ్రనేతలు ఎవరూ పెద్దగా పాల్గొనకపోవడం అప్పట్లోనే పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ నేపథ్యంలో జహంగీర్ ఎందుకు తప్పుకొన్నారనేది ఆసక్తికరంగా మారింది. కారణాలను మాత్రం ఆయన అధికారికంగా వెల్లడించలేదు.

## నోట్ల కట్టలు...నగల గుట్టలు

నాచారం: చూస్తేనే గుండెలదిరే స్థాయిలో రూ.500 నోట్ల కట్టలు... కిలోల కొద్దీ వెండి, బంగారు ఆభరణాలు... ఎకరాల్లో వ్యవసాయ భూములు... విలువైన ఫ్లాట్లు, స్థలాల దస్తావేజులు... ఇవన్నీ ఒక ప్రభుత్వ అధికారికి చెందిన ఆస్తులంటే నివ్వెరపోవాల్సిందే. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు జలమండలిలో జీఎం హోదా కలిగిన అధికారి ఇంట్లో సోదాలు చేయగా అతడి అవినీతి విశ్వరూపం బహిర్గతమైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో... హైదరాబాద్ జలమండలిలో ప్రాజెక్టు డివిజన్3 జీఎం(ఇంజినీరింగ్)గా పనిచేస్తున్న సగ్గం అనంతలక్ష్మి కుమార్(58) ఏసీబీకి చిక్కారు. మంగళవారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో ఏసీబీ హైదరాబాద్ సీఐయూ విభాగం డీఎస్పీ మాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం మల్లాపూర్ వెంకటరమణ కాలనీలోని కుమార్ ఇంటికి చేరుకొని సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లతోపాటు నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కుమార్ బంధువులు, స్నేహితులకు చెందిన 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అతడి ఇంట్లో రూ.500 నోట్లు భారీగా కనుగొనడంతో లెక్కింపు యంత్రాన్ని తీసుకురావాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం మొత్తం ఆస్తుల విలువను



రూ.5.88 కోట్లుగా గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకుపైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల, మరికొన్ని గ్రామాలతోపాటు నిజామాబాద్‌జిల్లా నవీపేటలో కుమార్, అతడి బినామీల పేరిట ఉన్న వ్యవసాయ భూములను ఏసీబీ గుర్తించింది. అధికారుల బృందాలు మంగళవారం ఆయా ప్రాంతాల్లో వివరాలను సేకరించాయి. హైదరాబాద్ శివారు చేర్యాల ప్రాంతంలో ఉన్న భూముల విలువ భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. నవీపేటలో మూడున్నర ఎకరాల భూమితోపాటు 400 చదరపు గజాల్లో కొబ్బరితోటతో కూడిన ఫామ్‌హౌస్‌ను గుర్తించారు.

- **వైభవంగా పెళ్లి చేసిన తర్వాతా నగదు కట్టలా?**

కుమార్ ఇంట్లో ఇటీవల జరిగిన వివాహంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. పెళ్లిలో పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేసినట్లు గుర్తించారు. వీడియోల ఆధారంగా ఆ వ్యయాన్ని అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. శుభకార్యాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన తర్వాత కూడా... రూ.కోటికిపైగా నగదు ఇంట్లో ఉండటం అధికారుల్ని ఆశ్చర్యపరిచింది. కుమార్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు... అతడి భార్య సహా ముగ్గురు కుటుంబ సభ్యులను బ్యాంకు వద్దకు తీసుకెళ్లారు. వారితోనే లాకర్లను తెరిపించారు. వాటిలో బంగారు నగలతోపాటు కొన్ని దస్తావేజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సోదాల అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

## హైదరాబాద్ రియాల్టీ ధూమ్.. ఆల్ టైమ్ రికార్డుకు చేరిన ఆఫీస్ మార్కెట్!

హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (జనవరిమార్చి) ఆల్ టైమ్ రికార్డు స్థాయిలో ఆఫీస్ స్థలాల లీజింగ్ కార్యకలాపాలు జరిగాయి. ఈ మూడు నెలల్లో ఏకంగా 31.5 లక్షల చదరపు అడుగుల (ఎంఎస్ఎఫ్) స్థలం లీజుకు వెళ్లింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 21.6 శాతం అధికం. ప్రముఖ వాణిజ్య రియల్ ఎస్టేట్ సేవల సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం ఆఫీస్ లీజింగ్ (సుమారు 2.2 కోట్ల చ.అ.)లో హైదరాబాద్ వాటానే 14 శాతంగా ఉండటం నగర ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ఈ త్రైమాసికంలో జరిగిన లావాదేవీల్లో సింహభాగం భారీ ఒప్పందాలే కావడం గమనార్హం. లక్ష చదరపు అడుగులు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న డీల్స్ మొత్తం లీజింగ్‌లో 81 శాతం వాటాను ఆక్రమించాయి. ఈ మొత్తం కార్యకలాపాల్లో అత్యధికంగా 91 శాతం లీజింగ్ ఒక్క మాదాపూర్‌లోనే జరగడం ఆ ప్రాంత ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ క్వార్టర్‌లో నగరంలో కొత్తగా ఆఫీస్ భవనాల నిర్మాణం పూర్తి కానప్పటికీ, డిమాండ్ మాత్రం బలంగా కొనసాగింది. ఫలితంగా నికరంగా 22.1 లక్షల చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి వచ్చింది. దీంతో నగరవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆఫీస్ స్థలాల శాతం 20.22 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మాదాపూర్‌లో ఖాళీలు కేవలం 7.5 శాతానికే పరిమితం కాగా, అక్కడి ఏగ్రేడ్ భవనాల్లో ఇది అత్యంత తక్కువగా 4.8 శాతంగా నమోదైంది. పెరిగిన డిమాండ్, తగ్గిన ఖాళీల ప్రభావంతో నగరంలో ఆఫీస్ అద్దెలు కూడా రికార్డు స్థాయికి చేరాయి. సగటున చదరపు అడుగు అద్దె గతేడాదితో పోలిస్తే 11.6 శాతం పెరిగి రూ. 92.2కు చేరింది. మాదాపూర్‌లో ఇది గరిష్ఠంగా రూ. 105.5గా ఉండగా, గచ్చిబౌలిలో కాస్త తక్కువగా రూ. 72.3గా ఉంది. ఐటీబీపీఎం రంగం 36 శాతంతో లీజింగ్‌లో అగ్రస్థానంలో నిలవగా, ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ (30 శాతం), బీఎఫ్ఎస్ఐ (23 శాతం) రంగాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు నగరంలో తమ కార్యకలాపాలను విస్తరించడం ఈ వృద్ధికి మరింత ఊతమిచ్చింది.

## భారత ఇంధన రంగానికి లభించిన పెద్ద ఊరట

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేస్తున్న వేళ అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ సహా అధికంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పిస్తూ ఓ తాజా లైసెన్స్‌ను జారీ చేసింది. ఆంక్షల కారణంగా సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా ముడి చమురు కార్గోలను స్వీకరించేందుకు 30 రోజుల పాటు అనుమతి ఇచ్చింది. హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఆందోళనలతో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

**అమెరికా అనుమతి దేనికి?**

యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఈ తాత్కాలిక లైసెన్స్, ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసి సముద్ర మార్గంలో ఉన్న రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను అందుకునేందుకు మాత్రమే వర్తిస్తుంది. దీని ద్వారా కొత్తగా రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకోవడానికి గానీ, కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి గానీ అవకాశం లేదు. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలకు మద్దతుగా, సరఫరాలో అంతరాయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ తన 'ఎక్స్' ఖాతాలో తెలిపారు. భౌతిక క్రూడ్ మార్కెట్‌ను స్థిరీకరించడం, ఇంధన అవసరాలు అధికంగా ఉన్న దేశాలకు చమురు చేరేలా చూడటం కూడా ఈ లైసెన్స్ ఉద్దేశమని ఆయన వివరించారు.

**భారత్‌కు ఎలా ప్రయోజనం?**

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు ఎంతో కీలకమైంది. తన మొత్తం చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడే భారత్, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులో ఏ చిన్న మార్పు జరిగినా తీవ్రంగా ప్రభావితమవుతుంది. గత ఏడాది కాలంగా భారత్ రష్యా నుంచి రాయితీ ధరలకు భారీగా చమురు కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి రష్యా నుంచి భారత్ దిగుమతులు రోజుకు 2.25 మిలియన్ బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. తాజా లైసెన్స్ వల్ల, సముద్రంలో చిక్కుకున్న రష్యా చమురు కార్గోలను అమెరికా ద్వితీయ స్థాయి ఆంక్షల భయం లేకుండా భారత రిఫైనరీలు స్వీకరించవచ్చు. ఇది రిఫైనరీలకు స్వల్పకాలికంగా ఊరటనిచ్చే అంశం.

## నార్వే జర్నలిస్టుకు భారత విదేశాంగ శాఖ గట్టి జవాబు

ప్రధాని నరేంద్ర మోదీ నార్వే పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛపై ప్రశ్నలు లేవనెత్తిన ఓ నార్వేజియన్ జర్నలిస్టుకు, భారత విదేశాంగ శాఖ అధికారి ఘాటుగా సమాధానమిచ్చారు. 'ఏమైనా సమస్యలుంటే కోర్టుకు వెళ్లండి' అంటూ ఆయన ఇచ్చిన జవాబు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐరోపా పర్యటనలో భాగంగా ఓస్లోలో ప్రధాని మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్వే ప్రధాని ప్రశ్నలకు సమాధానమిచ్చినా, మోదీ మాత్రం ప్రశ్నలను పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీనిపై నార్వేజియన్ జర్నలిస్ట్ హెల్లె లింగ్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తన ప్రశ్నను స్వీకరించలేదని ఆమె ఆరోపించారు. అనంతరం భారత విదేశాంగ శాఖ నిర్వహించిన మీడియా సమావేశంలో అదే జర్నలిస్ట్ పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాలపై ఆమె ప్రశ్నలు సంధించారు. దీంతో ఆమెకు, విదేశాంగ శాఖ కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సిబి జార్జ్ తన సమాధానంలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బలంగా సమర్థించారు. భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, న్యాయం కోసం ఆర్టికల్ 32, 226 కింద కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. కొంతమంది విదేశీ విమర్శకులు "అజ్ఞాన ఎన్జీవోలు" ఇచ్చే నివేదికలపై ఆధారపడి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏవైనా సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలని ఆమెకు సూచించారు.

## నేడు దేశవ్యాప్తంగా కెమిస్టులు, డ్రగ్గిస్టుల సమ్మె మెడికల్ షాపులు బంద్

* **మల్కాజిగిరి, ఈసీయోల్ కెమిస్టులు & డ్రగ్గిస్టుల సంఘం మద్దతు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : దేశవ్యాప్తంగా ఔషధ వ్యాపారులకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోరుతూ భారతదేశంలోని కెమిస్టులు, డ్రగ్గిస్టులు మే 20న ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, మల్కాజిగిరి , ఈసియోల్ కెమిస్టులు & డ్రగ్గిస్టుల సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సమ్మెలో భాగంగా మల్కాజిగిరి, ఈసియోల్ పరిధిలోని మెడికల్ షాపులు స్వచ్ఛందంగా మూసివేయనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆన్‌లైన్‌లో అనధికారికంగా మందుల విక్రయం, చిన్న వ్యాపారులపై పెరుగుతున్న ఆర్థిక భారం, డ్రగ్ లైసెన్స్ సమస్యలు, వ్యాపార రక్షణ వంటి ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని, సమ్మెకు సహకరించాలని సంఘం విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి , ఈసియోల్ ప్రాంతాల కెమిస్టులు, డ్రగ్గిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

* **జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : నరసింహులపేట, చిన్న గూడూరు మండలాలలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మిక విస్తృత పర్యటనలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మక్కజొన్న, ధాన్యం,పెద్దనాగారం, వసురుతండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ రికార్డులను సరిగా మెయింటైన్ చేయడం లేదనీ, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గన్ని సంచుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఓ, అగ్రికల్చర్ అధికారులపై కఠిన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ రవాణా తదితర అంశాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించారు. అయినా కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని అట్టి వారిని గుర్తించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దాన్యం మ్యాచ్యూర్ వచ్చిన తర్వాతనే కూపన్ల ద్వారా కేటాయించాలని సూచించారు. రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా అందుబాటులో ఉంచుకోవాలని లోడింగ్,అన్లోడింగ్ విషయంలో వేగంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ నరసింహారావు, స్థానిక ఎంపీడీవో ఎమ్మార్వో తదితరులు ఉన్నారు.

## మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దాలి

* **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : చారిత్రక - సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా మెదక్ జిల్లాకు వేల ఏళ్ల చరిత్ర, అపారమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు గొప్ప గుర్తింపు ఉందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను, వారసత్వ సంపదను కాపాడుకోవాలనీ సిఎస్ఐ పాఠశాలలోని ఆడిటోరియంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు,కోటలు,మసీదులు, పురాతన కట్టడాలు, జానపద కళలు, భాషలు, సాహిత్యం, సంప్రదాయ పండుగలు మన చారిత్రక , సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చరిత్ర అనేది కేవలం గతాన్ని గుర్తుచేసేది మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం, మన పూర్వీకుల త్యాగాలు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళా వైభవం సమాజ అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉండటానికి మన పురాతన సంపద, వైవిధ్యభరితమైన సంప్రదాయాలే కారణమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ కానువ రాధిక, కవులు,రచయితలు, ఉపాధ్యాయులు,పౌరులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఈహెచ్ఎస్కు ఉద్యోగుల వివరాలు సేకరించాలి.. ప్రభుత్వం ఆదేశం




హైదరాబాద్: నూతన ఈహెచ్ఎస్ కోసం ఉద్యోగుల వివరాలు సేకరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులు, పింఛనర్ల వివరాలు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని వివిధ విభాగాలను ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈనెల 31 నాటికి వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించింది. జూన్ 2న ఉద్యోగులు, పింఛనర్లకు హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈహెచ్ఎస్ వివరాల సేకరణకు ఆదేశాలు జారీ చేసింది.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలుగా రాయపూడి భవాని నియామకం

* **పలువురు నాయకుల హర్షం**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు గా మిర్యాలగూడ చెందిన రాయపూడి భవాని ని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా మహాసభ నాయకులు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభాధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ జిల్లాకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర పదవిని ఇవ్వడం పట్ల వారు అమరావతిని అభినందించారు. రాయపూడి భవాని గత కొన్ని సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్య ప్రజలకు విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేసి మంచి సమర్థవంతమైన నాయకురాలుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఆర్యవైశ్యుల అభిమానం పొందిన రాయపూడి భవానికి రాష్ట్ర పదవి ఇవ్వడం సరైన నిర్ణయం అన్నారు. అలాగే మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ్రాజ్యలక్ష్మి కోశాధికారి అలభట్ల శ్రీదేవి, అదనపు ప్రధాన కార్యదర్శి వాసా శ్రీదేవిలా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు, హర్షం వ్యక్తం చేసిన వారిలో, నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాసులు, కోశాధికారి జైని రాములు, అదనపు ప్రధాన కార్యదర్శి నాల్ల వెంకటేశ్వర్లు, మహాసభ మాజీ జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు వాసవి క్లబ్ గవర్నర్ సతీష్ కుమార్, కోటగిరి రామకృష్ణ,జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండా నాగరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి సోమచంద్రశేఖర్ , ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, నాంపల్లి నరసింహ,జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు యమ దయాకర్, కార్పొరేటర్ యామా కవితా దయాకర్, కోటగిరి దైవాదినం, ఎల్ వి కుమార్, లకుమారపు శ్రీనివాసులు, పారేపల్లి శ్రీనివాస్, నల్లగొండ శ్రీనివాస్, యామ మురళి, బండారు వెంకటేశ్వర్లు , తదితరులు ఉన్నారు.

## ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు

: **కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, హమాలీ, రవాణా తదితర ఏర్పాట్లు సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు మొత్తం 3,76,288 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేయగా, అందులో 2,19,729.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించి నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో 1,56,558.5 క్వింటాళ్ల మొక్క జొన్న నిల్వ ఉన్నట్లు వివరించారు. మంగళవారం ఒక్కరోజులోనే 10,091.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు చెప్పారు. రవాణా కోసం 458 లారీలు, 131 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని, అదనంగా మరో 1,50,000 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇల్లందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, జూలూరుపాడు, గుండాల, అల్లపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్నను త్వరితగతిన గోదాములకు తరలిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు వేగంగా జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ చెప్పారు.

## పథకాల అమలుకు సమన్వయం తో పనిచేయాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పీ.ఎం జన్మన్, డి.ఏ జగవా పథకాల అమల్లో భాగంగా నిర్వహిస్తున్న "జన్ భాగీదారి - సర్వే డోర్, సర్వే విలేజ్ " ఐ.ఈ.సీ అవగాహన కార్యక్రమాలను సమర్థ వంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లో జరిగిన సమీక్ష సమావేశం లో మాట్లాడుతూ మే 19 నుంచి 27 వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమాలను జిల్లాలో విజయ వంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.జిల్లాలో ఎంపికైన గిరిజన గ్రామాల్లో ఆరోగ్య తనిఖీలు, సికిల్ సెల్ అనీమియా పై అవగాహన కార్యక్రమాలు, పోషకాహార శిబిరాలు, సంక్షేమ పథకాల నమోదు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యలను స్వీకరించి వెంటనే పరిష్కరించేలా "జన్ సున్వాయి" కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.తరిగొప్పుల మండలం లోని బొంతగట్టు నాగారం, నర్మెట్ట మండలంలోని బొమ్మకూర్, చిల్పూర్ మండలంలోని మల్లక్‌పేట్, పాలకుర్తి మండలంలోని ఫతేపూర్, కొండాపూర్, దేవరుప్పుల మండలం లోని మైలారం, మాదాపురం, కొడకండ్ల మండలం లోని ధర్మపురం, మొండ్రాయి గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి గ్రామానికి ప్రత్యేక బృందాలను నియమించి ఆరోగ్యం, విద్య, ఉపాధి, సంక్షేమ సేవల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు.

## పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను సాదించాలి

* **సాదించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ కె యాకుబ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : పుచ్చల పల్లి సుందరయ్య ఆశయాలను సాదించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ కె యాకుబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని ఎమ్ ఎస్ భవన్ లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఈరోజు ఆయన 41వర్ధంతి ఇది ఓ మహానేతను స్మరించుకునే రోజు కాదు రాజకీయాల అసలు అర్థాన్ని గుర్తు చేసుకుని రోజు కామ్రేడ్ సుందరయ్య జీవితం ఒక వెలుగు దీపం లా కనిపిస్తుంది భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదల పక్షాన నిలిచిన నేత అని భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య అసలు పేరు పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి తల్లి శేషమ్మ ,చిన్న వయసులోనే సమాజంలోని అసమానతలను గమనించిన ఆయన కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ తన పేరులోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నారు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కామ్రేడ్ అమీర్ హైదర్ ఖాన్ మార్గ దర్శకత్వంలో కమ్యూనిస్టు పార్టీలో చేరిన సుందరయ్య దక్షిణ భారతదేశంలో పార్టీ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారని అన్నారు అయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలి అని కోరారు అనంతరం సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సైదులు, ఎం వీరస్వామి, ప్రతాపరెడ్డి, దోసపాటి బిక్షం, వెంకటప్పయ్యరువయ్య, వీరన్న, సైదులు, సందీప్, బి గోపి, సిహెచ్ విజయ్, హాశు గురవయ్య, వెంకన్న ,కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులివ్వాలి

* **ఎమ్‌పానల్‌లో ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టుకు కార్డులివ్వాలి**
* **జిల్లా కలెక్టర్‌కు అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల వినతి**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం తొలుత అక్రిడేషన్ కమిటీ సభ్యులతోపాటు నాలుగు కార్డులు అందిస్తామని డిపిఆర్ ప్రస్తావన తీసుకురాగా జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. తమకు కార్డు ప్రస్తుతం అవసరం లేదని జిల్లాలోని మండలాల రిపోర్టర్లకు కార్డు అందించినప్పుడే తాము కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వ నిబంధన ప్రకారం పెద్ద పత్రికలకు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండల రిపోర్టర్లకు కార్డులు ఇచ్చిన్నప్పుడే జిల్లా కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు. ఎమ్‌పానల్లో ఉన్న ప్రతి పత్రికకు, ఎలక్ట్రానిక్ ఛానళ్లకు, కేబుల్ ఛానళ్లకు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్‌కు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో, కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాలతోపాటు ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లాలో 9 కార్డులు, కేబుల్ చానళ్లకు కూడా డిస్ట్రిక్ట్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేసి ప్రతిని కలెక్టర్‌కు అందించారు. తీర్మాణ కాపీని స్వీకరించిన కలెక్టర్ ఐఅండ్‌పిఆర్ కమిషనర్‌తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు కల్లోజీ శ్రీనివాస్, బి.వి. రమణారెడ్డి, వట్టి కొండ రవి, ఎం.ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్ రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యవసర సేవలకు ప్రత్యేక చర్యలు

: **జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ**

జనగామ,ప్రజాస్ఫూర్తి : దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన ఆల్ ఇండియా కెమిస్టుల బంద్ నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు అత్యవసర మందుల సరఫరా లో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మెడికల్ షాపు ల యాజమాన్యాలకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు పేర్కొ న్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మందులు అందుబాటు లో ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించి నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ఫార్మసీలు అత్యవసర సేవల నిమిత్తం సాధారణంగా పని చేయనున్నాయని వెల్లడించారు. అలాగే ప్రజలకు అవసర మైన మందులు అందుబాటులో ఉండే విధంగా కొన్ని మెడికల్ షాపుల ఫోన్ నంబర్లను ఆయా షాపుల వద్ద ప్రదర్శిం చనున్నట్లు తెలిపా రు. అవసరమైన సందర్భాల్లో ప్రజలు ఆ నంబర్లను సంప్రదించి మందుల సరఫరా, ఇతర సహా యం పొందవచ్చన్నారు.ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా అవసరమైన మందులను సాధారణ విధంగానే కొనుగోలు చేసు కోవచ్చని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా మందుల లభ్యతకు సంబంధించి ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ఫిర్యాదులు / సహాయం కోసం సంప్ర దించవలసిన టోల్ ఫ్రీ నంబర్ 1800425660, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, జనగామ 9849634754, 8333925867 ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

## వేగంగా ధాన్యం కొనుగోలు

* **26,191 మంది రైతులకు 260.03 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : జిల్లాలో గతం కంటే అత్యంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని , ఎలాంటి అక్రమాలు లేకుండా పారదర్శకంగా రైతుల నుంచి మంగళవారం వరకు 1,85,688.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 37,072 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి 26,191 మంది రైతులకు 260.03 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్ లో జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత స్పీడ్ అప్ చేసి, అకాల వర్షాల నుండి కాపాడడానికి టర్పాలీను కవర్లను అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపట్టాలన్నారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు.

## పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

* **తుమ్మల వీరారెడ్డి..**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత,తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన త్యాగ ధనుడని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు.మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయం దొడ్డి కొమరయ్య భవన్ లో పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం,పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ రైతాంగ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య అగ్ర భాగాన ఉండి సాయుధ పోరాటాన్నినడిపారని అన్నారు.వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య ప్రజల కోసం తనకు వారసత్వంగా వచ్చిన వందలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి ఇచ్చి, జీవితాంతం నిరాడంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు. పార్లమెంటుకు,శాసనసభకు సైకిల్ పై వెళ్లేవారన్నారు. నేటి యువత సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయసాధన కోసం కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, కొండ అనురాధ, ఖమ్మంపాటి శంకర్, తుమ్మల పద్మ, రాజు, భీమ గాని గణేష్, నరసింహ, రవి, మధుసూదన్ రెడ్డి, సరోజ, రాజేష్, పరిపూర్ణాచారి, కొండ ఎంకన్న, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెక్ పోస్ట్ ల వద్ద పటిష్టమైన భద్రత, నిఘా అవసరం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన భద్రతా మరియు నిఘా అవసరమని జిల్లా పశువైద్య శాఖ అధికారి డాక్టర్ జి.వి. రమేష్ తెలిపారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలోని ఆరు చెక్‌పోస్టుల వద్ద పోలీసు మరియు పశువైద్య సిబ్బందిని 24 గంటల పాటు విధుల్లో నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. చెక్‌పోస్టుల ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలకు అనుగుణంగా పశువుల రవాణా జరుగుతుందో లేదో పరిశీలించాలని సూచించారు. సరైన పశువైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని ఆలగడప అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్, వాడపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ మరియు అవంతిపురం పశువుల సంతను సందర్శించిన డాక్టర్ జి.వి. రమేష్ అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల రవాణా సమయంలో జీవహింస నివారణ చట్టం 1960, గోహత్య నివారణ చట్టం 1977 పశువుల రవాణా చట్టం 1978 ప్రకారం అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. పశువుల సంతలలో పశువులకు పరిశుభ్రమైన తాగునీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పరిమితికి మించి పశువులను లోడ్ చేసిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరెడ్డి, పశువైద్యులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్వప్న , డాక్టర్ శశికళ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



జనగామ / లింగాల ఘణపురం, ప్రజాస్ఫూర్తి: స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మండలం లోని మాణిక్యపురం, ఏనబావి, ప్రాంతం ఐకేపీ కొనుగోలు కేంద్రాని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం ఏనబావి గ్రామానికి చెందిన రైతు పొన్నం తిరుమలేష్ వద్దు కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ డీజిల్ పోసుకొని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పై స్పందించిన రాజయ్య, తిరుమలేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, రవాణా సమస్యలు, గన్నీ బ్యాగుల కొరత వంటి అంశాలపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ కన్వీనర్ చౌదరిపల్లి శేఖర్, భాగ్య లక్ష్మి, ఎదునూరి వీరన్న,బండ చంద్రమౌళి, రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న నిర్వహించే జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మే 22వ తేదీన జిల్లా స్థాయి సభలు సమర్ధవంతంగా నిర్వహించాలనే ప్రభుత్వ సూచనల మేరకు రంగారెడ్డి జిల్లాలో జిల్లాస్థాయి సభను నిర్వహించేందుకు అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సభను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి సభలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాస్థాయి సభను రాష్ట్రగీతంతో ప్రారంభించాలని, ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై చర్చించాలని, జిల్లా స్థాయి సభలో ఆర్డీఓలు, తహశీల్దార్, ఎంపిడిఓ, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ , ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం అయినందున త్రాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జిల్లా స్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ జూమ్ మీటింగ్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చంద్రా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, డీఆర్ఓ శారద, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, డిపిఓ సురేశ్ మోహన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో అక్రమాలు సహించం

* **రైస్ మిల్లులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి గణపురం, కైలాపూర్‌లోని రైస్ మిల్లులను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలిస్తున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తికాగానే వెంటనే ట్రక్ షీట్‌లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైతులను మోసం చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వర్షాల ముందు మక్కల తరలింపును పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 90 శాతం మక్కల కొనుగోలు పూర్తయ్యిందన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ కూడా ట్రక్ షీట్‌ల జారీ విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిస్తూ, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# అనాథలైన కుటుంబానికి అండగా నిలిచిన సమ్మి గౌడ్ ఫౌండేషన్

* **మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం!**
* **75 కిలోల బియ్యం, నెలరోజుల నిత్యావసర సరుకులతో గద్దల ప్రభాకర్ కుటుంబానికి కొండంత అండ**





మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి: ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ రోజువారి కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే విధి వక్రించి గత వారం రోజుల కిందట వడదెబ్బతో ప్రభాకర్ అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. ఇంటి పెద్దను కోల్పోయిన భార్య గద్దల సునీత ప్రస్తుతం గ్రామపంచాయతీలో సఫాయి పని చేస్తూ ముగ్గురు ఆడపిల్లల తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.గద్దల శిరీష, గద్దల అనూష లకు వివాహం జరగగా ఇంకా పెళ్లి కాని చిన్న కూతురు గద్దల హరీష భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పేదరికంతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి ప్రభాకర్ మరణం గుండెలవిసే విషాదాన్ని మిగిల్చింది. ఇలాంటి సమయంలో చాలామంది వచ్చి పరామర్శించి వెళ్తారు. ఓదార్పు మాటలు చెబుతారు.కానీ ఆ తర్వాత ఆ కుటుంబం ఎలా బతుకుతుందో ఆలోచించే వారు చాలా అరుదు. “సమ్మి గౌడ్ ఫౌండేషన్” అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ మాత్రం పూర్తిగా భిన్నంగా స్పందించారు.”చనిపోయిన రోజు జనం ఉంటారు. పది రోజుల కార్యక్రమాలు పూర్తయ్యాకే అసలు బాధ మొదలవుతుంది. ఆకలి, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల భవిష్యత్తు ఆ సమయంలోనే కుటుంబాన్ని వెంటాడతాయి. అలాంటి సమయంలో ఆదుకునే చేతులే నిజమైన బంధుత్వం” అనే మానవీయ దృక్పథంతో ఆయన స్పందించిన తీరు ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది.ప్రభాకర్ చనిపోయిన మరుసటి పరామర్శించిన సమ్మిగౌడ్ తాను ప్రస్తుతం గ్రామంలో లేకపోయినా ఆ కుటుంబం ఆకలితో అలమటించకూడదనే ఆలోచనతో వెంటనే తన ఫౌండేషన్ సభ్యులను రంగంలోకి దించారు. ప్రభాకర్ కుటుంబానికి నెలరోజుల పాటు సరిపడే విధంగా 75 కిలోల నాణ్యమైన బియ్యంతో పాటు పప్పులు, నూనె, కూరగాయలు మరియు ఇతర నిత్యావసర సరుకులను పంపించి గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కేవలం సరుకులు పంపించడం వరకే ఆగిపోకుండా... “మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వం... ధైర్యంగా ఉండండి” అంటూ సమ్మయ్య గౌడ్ ఫోన్ ద్వారా గద్దల సునీతకు, పిల్లలకు ఇచ్చిన భరోసా ఆ కుటుంబానికి కొత్త జీవన ధైర్యాన్ని ఇచ్చింది. ఆ మాటలు విన్న గ్రామస్తులు సైతం కంటతడి పెట్టారు. సామాజిక సేవ అంటే అవసరంలో ఉన్న వారి కన్నీరు తుడవడం, ఆకలితో ఉన్న కుటుంబానికి అన్నం పెట్టడం, అనాథలైన పిల్లలకు భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం అనే విషయాన్ని సమ్మయ్య గౌడ్ మరోసారి తన సేవా కార్యక్రమాల ద్వారా నిరూపించారని గ్రామ పెద్దలు కొనియాడుతున్నారు. ప్రస్తుతం సమాజంలో చాలామంది ప్రచారాల కోసం సేవలు చేస్తున్న తరుణంలో... ఎలాంటి ఆర్భాటం లేకుండా,గత 18 సంవత్సరాలు గా నిజమైన మానవత్వంతో పనిచేస్తున్న “సమ్మి గౌడ్ ఫౌండేషన్” సేవలు ఆదర్శప్రాయమని దళిత సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. “సమ్మయ్య గౌడ్ లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరం... ఇలాంటి మనుషుల వల్లే ఇంకా మానవత్వం బ్రతికే ఉంది” అంటూ గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులుమంద ప్రవీణ్,తండ సంపత్,పలుస సునీతా వెంకన్న,జర్నలిస్ట్ లు రవి చంద్ర, మంద విక్రమ్,నలుగుర్తి ఉప్పలయ్య, మంద విక్రమ్, పలుస రాకేష్, పోలేపాక ఉప్పలయ్య, మంద శ్రీనివాస్, మంద సాయిబాబు, అన్నపాక వెంకన్న, గద్దల విజేందర్, మంద ప్రవీణ్, పందుల నాగేంద్రబాబు, గద్దల హరీష్, అజిత్ కుమార్, శ్రావణ్, భరత్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.తమ కష్టసమయంలో దేవుడిలా స్పందించి నెలరోజుల సరుకులు పంపించిన చిలువేరు సమ్మయ్య గౌడ్‌కు, సమ్మి గౌడ్ ఫౌండేషన్ సభ్యులకు ప్రభాకర్ భార్య గద్దల సునీత కన్నీటి కళ్లతో కృతజ్ఞతలు తెలియజేశారు.ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ మానవత్వపు ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. “సాయం అంటే ఇదే... సేవ అంటే ఇదే...” అంటూ గ్రామ ప్రజలు సమ్మయ్య గౌడ్ సేవా తత్వాన్ని హృదయపూర్వకంగా కొనియాడుతున్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి



జయశంకర్ భూపాలపల్లి : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.పుష్కరాల కోసం 330 ఎనిమిది మీటర్ల స్తంభాలు, 152 తొమ్మిది మీటర్ల స్తంభాలు, 8 పదకొండు మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 5 కి.మీ. 11 కేవీ లైన్, 12 కి.మీ. ఎల్‌టీ లైన్ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కోసం 16 కీలక ప్రాంతాల్లో 12 రోజుల పాటు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. విధుల్లో 4 మంది డివిజనల్ ఇంజినీర్లు, 6 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, 13 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 12 మంది సబ్ ఇంజినీర్లు, 13 మంది లైన్ ఇన్స్పెక్టర్లు, 9 మంది లైన్మెన్లు, 45 మంది అసిస్టెంట్ లైన్మెన్లు సహా మొత్తం 150 మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న పరిస్థితుల్లో వెంటనే మార్పిడి చేసేందుకు అదనపు స్పేర్ ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. దేవాలయం, టెంట్ సిటీ, వీఐపీ ఘాట్, మెయిన్ ఘాట్, హరిత హోటల్ ప్రాంతాలకు డబుల్ ఫీడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక ఫీడర్‌లో అంతరాయం వచ్చినా మరో ఫీడర్ ద్వారా వెంటనే విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.కాళేశ్వరం, మహాదేవపూర్, 132 కేవీ కాటారం సబ్‌స్టేషన్ వద్ద ప్రత్యేక బ్రేక్‌డౌన్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రధాన లక్ష్యమని సీఎండీ పేర్కొన్నారు.

**భక్తులకు సూచనలు**

పుష్కర ఘాట్లు, రహదారులు, పూజా మండపాల సమీపంలో హెచ్చరిక టేపులు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ తీగలకు సమీపంలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

* **జిల్లా కలెక్టర్ కె.హరిత**



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణ పనులు పూర్తిచేయాలని, పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోపు ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణాలు, వంతెనల పనులు, ఇతర మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామాలకు త్రాగునీరు అందించాలని, పైప్ లైన్ల మరమ్మత్తులు పూర్తిచేసి ప్రతిరోజు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ పనులు, సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించి దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ఇతర కార్యక్రమాల వివరాల నివేదికను అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో ఉచిత వేసవి విలువిద్య శిబిరంలో విద్యార్థులకు పౌష్టికాహార పంపిణీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విలు విద్య శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంగా బాయిల్డ్ ఎగ్స్, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని కుమారి ముత్యం లక్ష్మి ప్రియాంక తల్లిదండ్రులు డాక్టర్ ముత్యం రాకేష్,రత్న కుమారి (రత్న డెంటల్ క్లినిక్, మూడు కొట్ల దగ్గర, మానుకోట) తమ సేవాభావంతో నిర్వహించారు.విద్యార్థుల ఆరోగ్యం, శారీరక దృఢత్వం, క్రీడా ప్రతిభాభివృద్ధికి పౌష్టికాహారం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఇలాంటి సహకారం ఇతరులకు స్ఫూర్తిదాయకమని శిబిర నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సాధుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున డాక్టర్ ముత్యం రాకేష్ కి,రత్న కుమారి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అధ్యక్షులు సాదుల సారంగపాణి,సాధుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ట్రాఫిక్, సైబర్ భద్రత పై అవగాహన

: **సీ.ఐ సత్యనారాయణ రెడ్డి**



జనగామ,ప్రజాస్ఫూర్తి: జిల్లా కేంద్రం లోని బతుకమ్మ కుంట లో పోలీసులు ప్రజలతో నేరుగా కమ్యూనిటీ కాంటాక్ట్ ఏర్పరచుకునే లక్ష్యంతో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన వీడి యోలను ప్రదర్శించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యం లో, మెధా హాస్పిటల్స్ డైరెక్టర్ సంజీవ రెడ్డి సహకారం తో నిర్వ హించారు. కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలు, హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యత, సీట్ బెల్ట్ అవసరం, ట్రిపుల్ రైడింగ్ ప్రమాదాలు, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి, వాటి నుంచి ఎలా జాగ్రత్తపడాలి, అనుమానా స్పద కాల్స్, లింకులు, ఆన్‌లైన్ మోసాలపై ఎలా అప్రమత్తంగా ఉండాలి వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కలిగించే వీడియోలను చూపించారు.ఈ వీడియోలు ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతను పెంపొందించడమే కాకుండా భద్రతతో వాహనాలు నడపాలనే ఆలోచనను బలపరిచాయి. ప్రజ లు ఆసక్తిగా వీక్షిస్తూ సూచనలు పాటించేందుకు ముందుకు రావడం కార్యక్రమం విజయవంత మైనదని అధికారులు తెలిపారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, సమాజాన్ని మరింత సురక్షితంగా మార్చడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

## నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల బయ్యారం మండలంలోని బాల్య తండా, జగ్న తండా, జగ్గు తండా, బయ్యారం గ్రామాలలో, మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండ గ్రామాలలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, డిటిఎఫ్ మహబూబాబాద్, ఎస్టిఎఫ్ హైదరాబాద్ టీంలు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో భూక్య చమిలి, తేజావత్ రాజి , జినుక ఉపేందర్ , కున్సోత్ సురేష్ , భూక్య దేవి, మూడు పత్రు (06) గురు ముద్దాయిలపై కేసు నమోదు చేసి, (18) లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని (600) లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగింది. తదుపరి ముద్దాయిలను తాహసిల్దార్ బయ్యారం ముందు బైండోవర్ చేశారు. ఇట్టి దాడులలో ఎక్సైజ్ సిఐ లు జి చిరంజీవి, సిహెచ్ నీరజ, ఐ అశోక్ కుమార్, ఎస్ టి ఎఫ్ హైదరాబాద్ సిఐ నాగరాజు, ఎక్సైజ్ ఎస్ ఐ ఆర్ కిరీటి, సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ లులు మాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు




హైదరాబాద్: నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న లులు మాల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ‘మిక్చర్‌లో బల్లి’ అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో ఎక్కువ కాలం ఆహారం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలు, సుమారు 150 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

# సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాస్వామ్యబద్ధ పోరాటం

: సాదిక్ ఆలీ
* కలెక్టర్ ముందుకు 12 ప్రజా డిమాండ్లు



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ బాధితుల రక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన పత్రిక సమావేశం లో జిల్లా ప్రజలకు సంబంధించిన 12 ప్రధాన డిమాండ్లను విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైఖరి కారణంగా పలు సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కమిటీ కన్వీనర్ సాదిక్ ఆలీ డిమాండ్ చేశారు. ముఖ్యంగా కలెక్టరేట్ భవనం లోని సెల్లార్ పార్కింగ్‌లో టూ వీలర్లు, కార్లు సహా అన్ని వాహనాలను ఉద యం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు అనుమ తించాలని కోరారు. అనంతరం భద్రతా పరమైన నియమ నిబంధనలతో వాహనాల పార్కింగ్ కు అవకాశం కల్పించా లని తెలిపారు. తొలగించిన వనిత టీ స్టాల్, డైరీ స్టాల్ లను గతంలో ఉన్న స్థలాల్లోనే ఎటు వంటి షరతులు లేకుండా పునరుద్ధ రించాలని కమిటీ డిమాండ్ చేసింది. దళిత, బీసీ మహిళల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రైతులు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యా లను ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో పేరుకు పోయిన నిల్వల నుంచి పది రోజుల్లోగా కొనుగోలు చేయాలని కోరారు. గన్నీలు, లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా సమస్య లను పరిష్కరించి రైతు లకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇసుక, మట్టి రవాణా విషయంలో రెవెన్యూ అధికారులు ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా, ఇతర గృహ నిర్మాణా లకు న్యాయమైన ధరకు ఇసుక అందుబాటులో ఉంచాలని కోరారు. ట్రాక్టర్లు, జేసీబీలు, లారీ యజ మానులపై విధిస్తున్న భారీ జరిమానా లను సమీక్షించి, పరి స్థితులకు అనుగుణంగా తక్కువ మొత్తాల్లోనే జరిమానాలు విధిం చాలని కమిటీ పేర్కొంది. అలాగే ఇసుక సమస్య పరిష్కారానికి వాహన యజమానులు, కార్మిక సంఘాలు, భవన యజమాను లతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా విలేఖరుల అక్రి డిటేషన్ కమిటీలో స్థానికేతరు లను తొలగించి స్థానికంగా పనిచేస్తున్న పాత్రికేయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం లోకి విలేఖరుల ప్రవేశం పై ఎటువంటి ఆంక్షలు విధించ రాదన్నారు. మాజీ కౌన్సిలర్ కత్తుల రాజిరెడ్డి విషయంలో ప్రతీకార చర్యలు నిలిపివేయా లని, న్యాయ వ్యవస్థను అవ మానించిన ఘటనపై కలెక్టర్ బే షరతుగా క్షమాపణ చెప్పాలని కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగు లు, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల పట్ల కక్ష పూరిత వైఖరిని మానుకో వాలని, భూ భారతి చట్టం అమలులో అసంబద్ధ నిబంధనలు ఉపయోగించ రాదని పేర్కొన్నారు. రైతుల నుంచి ఒరిజినల్ పాస్ బుక్కు, టైటిల్ డీడ్లు తీసుకోవడం నిలిపివేయాలని కోరారు. చివరి గా కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌ను తిరిగి పునరుద్ధరించి ఉద్యోగులు, సందర్శకులకు భోజన సదు పాయం కల్పించాలని కమిటీ డిమాండ్ చేసింది. ఈ ప్రజా డిమాండ్లు నెరవేరే వరకు మహాత్మాగాంధీ ఆశయాలతో ప్రజా స్వామ్యబద్ధంగా పోరాటం కొన సాగిస్తామని సాదిక్ ఆలీ తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మంగళంపల్లి రాజు, సాంబరాజు యాదగిరి, బోట్ల శేఖర్, బూడిద గోపి, టీఆర్ ఎస్ (కవిత) పార్టీ నాయకుడు ఆంజనేయులు, న్యాయవాదులు బానోతు ధర్మబిక్షం నాయక్, నాగిళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావనరుల కేంద్రాన్ని తనిఖీ చేసిన సెక్టోరియల్ అధికారులు



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండల విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం రోజున జిల్లా సెక్టోరియల్ అధికారులు భరత్ కుమార్, సత్తయ్య, కృష్ణమూర్తి, విజయలక్ష్మి లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల ప్రోగ్రెషన్ యాక్టివిటీ ని త్వరగా పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదును ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతం ఇంక్రీజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ విజయ్ కుమార్,ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ వెంకటేష్, సిఆర్పి లు నీలం శేఖర్, దయాకర్, శివకుమార్, రవి, బుచ్చయ్య మరియు మెసెంజర్ విజయ్ లు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక కోర్సులు

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి: ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర పర్యాటక, పురావస్తు శాఖలు యువత కోసం ప్రవేశపెట్టిన సర్టిఫికెట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ & ఆర్కియాలజీ కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం తన ఛాంబర్ లో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 18 నుంచి 23 వరకు జరుగుతున్న పర్యాటక వారోత్సవాల నేపథ్యంలో యువతకు పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాలపై అవగాహన కల్పించేందుకు ఈ కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన వారికి పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. యువతలో పర్యాటక ప్రదేశాలపై ఆసక్తి పెంపొం దించడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణ పై అవగాహన కల్పించడం ఈ కోర్సుల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. డిగ్రీ చదువు తున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. దరఖాస్తు లను గూగుల్ ఫారం దరఖాస్తు లింక్ ద్వారా సమర్పిం చవచ్చని చెప్పారు. అలాగే మరిన్ని వివరాల కోసం 9849905722, 9849905723 నంబర్లలో కోర్సు కోఆర్డినేటర్ డా. పి. నాగరాజును సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా టూరిజం అధికారి నర్సింహా రావు, ఇంచార్జి ఏడీ శ్రీనివాస్, జిల్లా ట్రైబల్ శాఖ అధికారి ప్రేమ కళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గూగులోత్ కిషన్ నాయక్ ఎన్నిక



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ లోని మూసా రాంబాగ్ రెవెన్యూ భవన్ కార్యాలయంలో అసోసియేషన్ కన్వీనర్ కోవిద చంద్రమౌళి అధ్యక్షతన సర్వ సభ్యుల సమావేశంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ రాష్ట్ర కమిటీలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ సామాజిక ఉద్యమకారుడు గుగులోత్ కిషన్ ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కోవిద చంద్రమౌళి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొంపెల్లి బిక్షపతి, గౌరవ అధ్యక్షుడిగా కందుకూరి దేవదాస్ తోపాటు వివిధ జిల్లాల నుండి రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు.2024 మార్చి నుండి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సామాజిక ఉద్యమకారుడు రిటైర్డ్ ఎంప్లాయ్ గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ ఇప్పటివరకు 2024 నుండి 25 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ పొందారు. తక్షణమే అందవలసిన బకాయిలను రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజలపై పెట్రో భారం తగదు

– మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:నాలుగు రోజులలోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై నాలుగు రూపాయలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ గత నాలుగు రోజుల కిందట పెట్రోల్, డీజిల్‌పై మూడు రూపాయలు పెంచిన నరేంద్ర మోడీ ప్రభుత్వం మళ్లీ 90 పైసలు పెంచి మొత్తం రూ.4 చేసిందని, దీంతో ప్రజలకుఐ ప్రయాణికులకు ములిగే నక్కపై తాటి పండు అడ్డ చందంగా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 5 రాష్ట్రాలలో ఎన్నికల ముందు చమురు సంక్షోభంలో రేట్లు పెంచట్లేదని చెప్పినటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికలు ముగిశాక నాలుగు రూపాయలు పెంచి తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకుందని విమర్శించారు. ఇదంతా చమురు యజమానుల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం వేస్తున్న ఎత్తుగడ అని ఆరోపించారు. ఇప్పటికే అన్ని విధాలుగా ధరలు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు అర్థాకలితో అలమటిస్తున్నారని, చమురు ధరల పెంపు వలన ఇంకా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని వారన్నారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా పేద, మధ్యతరగతి వారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జీవన్, సాగర్, సురేందర్, వైభవ్, చందన తదితరులు పాల్గొన్నారు.

# తురకగూడెం బజారులో నెలలుగా మురుగునీటి సమస్య

* పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి : కూసుమంచి మండలంలోని తురకగూడెం గ్రామంలో కిష్టాపురం వైపు వెళ్లే ప్రధాన బజారు ప్రాంతం నెలల తరబడి మురుగునీటితో నిండిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలోనే మురుగు నీరు నిల్వ ఉండటంతోదుర్వాసన వ్యాపించి,దోమలు పెరిగి ప్రజలు ఆరోగ్య భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు, ముఖ్యంగా కార్యదర్శి సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రెండు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మార్గం కావడంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మురుగునీటి కారణంగా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు పడిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. మురుగునీరు రోడ్లపైకి రావడంతో చిన్నారులు, వృద్ధులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

అస్తవ్యస్త డ్రైనేజీ: కాలువలు సరిగ్గా లేకపోవడం లేదా పూడిక పేరుకుపోవడం వల్ల మురుగు నీరు నిలిచిపోతుంది. వ్యాధులు మరియు దుర్వాసన మురుగు నీటి వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయి. కలుషిత నీరు మురుగు నీరు త్రాగునీటి పైపులలో కలవడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై స్పందించిన కొందరు గ్రామ పెద్దలు, అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేయడం తగదని తమ నిరసన తెలియజేస్తున్నారు.

# అత్యవసర మందులు అందుబాటులో ఉంచాం

* డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన ఆల్ ఇండియా కెమిస్టుల మెడికల్ షాప్ ల బంద్ నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు అత్యవసర మందుల సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణాలలో మెడికల్ షాపుల యాజమాన్యాలకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రధాన పట్టణాలలో కనీసం రెండు, చిన్న పట్టణాలలో ఒక ప్రైవేట్ మెడికల్ షాప్ తెరిచి ఉంచి, అవసరమైన సేవలు అందించాలని సూచనలు జారీ చేశారు. అన్ని పట్టణాలలో కనీసం ఒక మెడిప్లస్ ఫార్మసీ అపోలో ఫార్మసీలు లు తెరిచి ఉంటాయన్నారు.అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుబంధ ఫార్మసీలు అత్యవసర సేవల నిమిత్తం సాధారణంగా యధావిధిగా పనిచేయనున్నవని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా అవసరమైన మందులను సాధారణ విధంగానే కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా మందుల లభ్యతకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కింది నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు. సహాయం కోసం సంప్రదించవలసిన నంబర్లు: డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, నల్గొండ, 8333925882, బంద్ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి

* జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



కూసుమంచి ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలంలోని కూసుమంచి రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.ఈ రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, కూసుమంచి రైతు వేదిక నందు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం రైతులకు పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అనంతరం విత్తిన డీలర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు అందరూ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎమ్మార్పీ కి మించి అమ్మరాదని, కృత్రిమ కొరత సృష్టించరాదని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలియజేశారు. గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే మండల వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. హెచ్ టి పత్తి సాగు నిషేధం లో ఉన్నందున అటువంటి విత్తనాలను విక్రయించడం కానీ కొనుగోలు చేయడం గానీ లేదా సాగు చేయడం కానీ చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ బిక్షం, మండల వ్యవసాయ అధికారి శ్రీమతి రామదుగు వాణి ,వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ పారదర్శకం గా జరగాలి

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి: జనగణన 2027 తొలి విడత లో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం జనగాం మండలం పెద్ద పహాడ్ గ్రామం తో పాటు జనగాం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లతో మాట్లాడిన కలెక్టర్, ఇంటింటి సర్వే సక్రమం గా, పారదర్శకంగా నిర్వహించే బాధ్యత ఎన్యూమరేటర్లదేనని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. జన గణన తొలి దశలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన నిర్వహిస్తున్నట్లు తెలిపి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పక్కాగా సేకరించా లని ఆదేశించారు. సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచాలని స్పష్టం చేసిన కలెక్టర్,ఎండాకాలం దృష్ట్యా ఎన్యూమరేటర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాచారం అందించాలని, తద్వారా ప్రభుత్వానికి సరైన గణాంకాలు అందుతాయని తెలిపారు.

# సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారానికే టీజీబీకెఎస్ ఆవిర్భావం

: కెంగర్ల మల్లయ్య



జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య ఏర్పాటైందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య తెలిపారు. భూపాలపల్లి కోల్ బెల్ట్ ఏరియాలో ఆయన పర్యటించి 8 ఇంక్లైన్ గనిలో కార్మికులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిలోని అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం సింగరేణి స్టోర్‌ను సందర్శించి కార్మికులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఒకప్పుడు వేల కోట్ల ఆదాయం అందించిన సింగరేణి ప్రస్తుతం అప్పుల్లో కూరుకుపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కార్మికుల జీతాలు చెల్లించేందుకు సైతం సంస్థ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణికి రావాల్సిన రూ.51 వేల కోట్ల బకాయిల అంశంపై ప్రభుత్వంపై పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

# 41 కేజీలకు మించి తూకం వేస్తే చర్యలు

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : మండలం పెద్ద పహాడ్ లో ఏర్పాటు చేసిన పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, ట్యాబ్ ఎంట్రీ లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సప్లై, రవాణా, డీఆర్ డీఓ, సహకార శాఖల అధికారులు, కేంద్ర నిర్వాహకులు సమన్వయం తో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు జరగాలని పేర్కొన్న కలెక్టర్, 41 కేజీలకు ఒక్క గింజ ఎక్కువ తూకం వేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సరిపడా హమాలీలను ఏర్పాటు చేసి కాంటా ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి కేంద్రానికి అవసరమైన ట్రక్కు లను ఏర్పాటు చేశామని, కొనుగోలు అయిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే ట్రక్కుల్లో లోడింగ్ చేయాలని తెలిపారు. ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, పెండింగ్ లో ఉంచరాదని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు కూడా సరిపడా గోదాములను సిద్ధం చేసుకుని ట్రక్కులు చేరగానే అన్‌లోడింగ్ త్వరగా పూర్తి చేయా లని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం వెంటనే మిల్లులకు చేరేలా సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## పాలమూరు-రంగారెడ్డిని

# బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది

: **మంత్రి జూపల్లి**



హైదరాబాద్: పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం దారుణమన్నారు. హైదరాబాద్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. హంతకులే దొంగ ఏడుపులు ఏడ్చినట్లు బీఆర్ఎస్ నేతలు 'పాలమూరు పోరుయాత్ర' పేరిట పాదయాత్ర చేస్తామనడం విడ్డూరమని వాకిటి శ్రీహరి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పి ప్రజల వద్దకు వెళ్లాలని హితవు పలికారు. పొర్లుదండాలు పెట్టినా పాలమూరు ప్రజలు ఆ పార్టీని నమ్మరన్నారు. రెండేళ్లలో పాలమూరురంగారెడ్డి పూర్తి చేస్తామని గతంలో కేసీఆర్ అన్నారని జూపల్లి గుర్తుచేశారు. రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుకు సుమారు రూ.25 వేల కోట్లే ఖర్చు చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. పాదయాత్ర చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే రూ.లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని జూపల్లి విమర్శించారు.

# తెలంగాణ విజ్ఞప్తి మేరకు..

## కేఆర్ఎంబీ సమావేశం మరోమారు వాయిదా

హైదరాబాద్: నదీ జలాల్లో వాటా సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం మరోమారు వాయిదా పడింది. బోర్డు 21వ సమావేశాన్ని తొలుత ఈ నెల 14వ తేదీన ఏర్పాటు చేశారు. అదే రోజు ఏపీ కేబినెట్ సమావేశం ఉండడంతో భేటీని ఈనెల 21వ తేదీకి గతంలో వాయిదా వేశారు. అయితే.. ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. దీంతో కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. తెలంగాణ విజ్ఞప్తి మేరకు 21న జరగాల్సిన సమావేశాన్ని కేఆర్ఎంబీ వాయిదా వేసింది. సమావేశం తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని కృష్ణా బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చారు.

## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష



దిల్లీ: మళ్లీ నిర్వహించనున్న నీట్ యూజీ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత, ప్రొటోకాల్‌తో పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, పారదర్శకత అవసరాన్ని గుర్తుచేశారు. గత పరీక్షలో గుర్తించిన లోపాలను పరిష్కరించాలన్నారు. నీట్ పరీక్షపై కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు జరపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తత, భద్రతపై రాజీపడొద్దన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై సీబీఐ విచారణ జరుగుతోందని..ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మొదటి లక్ష్యమన్నారు. 2026 నీట్ పేపర్ లీక్ కావడంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## వాగ్దేవి విగ్రహం కోహినూర్ కన్నా ముఖ్యమైనది హైకోర్టులో పిటిషన్



మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల స్థలం వాగ్దేవి ఆలయానికే చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ తాత్కాలికంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాత (సరస్వతీ దేవి) విగ్రహాన్ని భారత్‌కు తిరిగి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు హిందూ సంఘాలు స్థానిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అది తమకు కోహినూర్ కంటే ముఖ్యమైనదని అందులో పేర్కొన్నాయి. మరోవైపు, ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి హిందూ సంఘాలు లేఖ రాశాయి. ఈ విగ్రహాన్ని తాము కోహినూర్ కన్నా ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నామని పిటిషర్లలో ఒకరైన కుల్‌దీప్ తివారీ పేర్కొన్నారు. ఇది సాంస్కృతిక వారసత్వంతో పాటు మత విశ్వాసంతో ముడిపడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలు మొదలుపెడితే బ్రిటన్ నుంచి తిరిగి తీసుకురావడం కష్టమైన పని కాదన్నారు. రాజ్‌పుత్‌లకు చెందిన పర్మార్ వంశ భోజ్ రాజు 1034లో ఇక్కడ సరస్వతీ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయి. 1305లో మాల్వా ప్రాంతంపై అల్లావుద్దీన్ ఖిల్జీ దండెత్తినప్పుడు ఈ ఆలయం ధ్వంసమైంది.

# ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ విస్తృత తనిఖీలు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో భాగంగా నల్లగొండ పట్టణంలో మంగళవారం విస్తృత స్థాయిలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివ శంకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌డబ్ల్యూ టెక్నిషియన్ ఎం. వెంకటపతి, డ్రైవర్ పి. వంశీ పాల్గొన్నారు. ఆర్‌పీ రోడ్, డీఈఓ కార్యాలయం పరిసరాలు, డీవీకే రోడ్, సాగర్ రోడ్ ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు, టీ స్టాల్స్, కేఫేలు, మండీలలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యాపారులు చికెన్, మటన్ వంటి మాంసాహార పదార్థాలను సరైన లేబులింగ్ లేకుండా, "యూజ్ బై డేట్" నమోదు చేయకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసినట్లు గుర్తించారు. శీతలీకరణ ఉష్ణోగ్రతల నిర్వహణకు సంబంధించిన లాగ్ బుక్స్ కూడా లేకపోవడం గమనించారు. కొన్ని మాంసాహార పదార్థాలు పూర్తిగా పాడైపోయిన స్థితిలో కనిపించాయి. బేకరీలలో గడువు ముగిసిన బిస్కెట్లు, చాక్లెట్లు, సాస్‌లు ఇతర ఆహార పదార్థాలతో కలిపి నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార భద్రత నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఈ పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేశారు. డీవీకే రోడ్డులోని ఒక కేఫేలో టీ తయారీలో రంగులు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా గుర్తించిన టీ పొడి, చక్కెర నమూనాలను ప్రయోగశాల విశ్లేషణ కోసం పంపించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులలో కలిపి సుమారు 120 కిలోల మేర గడువు ముగిసిన, పాడైపోయిన, నిల్వలో చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. వీటిలో చికెన్, మటన్, మంచూరియా, తయారుచేసిన చికెన్ వంటకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, బియ్యం, నూడుల్స్, సాస్‌లు, ఫుడ్ కలర్స్, టీ పొడి, చక్కెర, నిమ్మ ఫ్లేవర్లు తదితర పదార్థాలు ఉన్నాయి. అనుమానాస్పదంగా గుర్తించిన ఐదు ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల విశ్లేషణకు పంపించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఆహార వ్యాపార సంస్థలకు మెరుగుదల నోటీసులు జారీ చేయాలని అధికారులు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యాపారులకు, వీధి ఆహార విక్రేతలకు అవగాహన కల్పించారు. ఫుడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలని, వాడే నూనెలను అనుమతించిన పరిమితిలోనే వినియోగించాలని సూచించారు. టీ పొడిలో రంగులు కలపరాదని హెచ్చరించారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ ) విధానాన్ని పాటిస్తూ పాత స్టాక్‌ను ముందుగా వినియోగించాలని తెలిపారు. పండ్ల పక్వానికి కార్బైడ్ వినియోగం పూర్తిగా నిషేధమని, కేవలం ఎథిలీన్ సాచెట్ల ద్వారా మాత్రమే సురక్షిత పక్వ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు పాత వార్తాపత్రికలను ఉపయోగించరాదని, లూజ్ ఆయిల్స్ వినియోగం తగ్గించాలని, పరిశుభ్రమైన నిల్వ, శుభ్రమైన ఆహార తయారీ, సరైన హ్యాండ్లింగ్ పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రజలు కూడా ఆహారం కొనుగోలు చేసే సమయంలో పరిశుభ్రత, నిల్వ విధానం, గడువు తేదీలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులుసూచించారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపించినట్లయితే ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని కోరారు



## సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తాం

: **మోకు కనకా రెడ్డి**

జనగామ, ప్రజాస్ఫూర్తి: పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రం లో నిర్వహించిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తి తో జిల్లాలో మరిన్ని ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపం లో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన పట్టణ కార్యాలయం లో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మోకు కనకా రెడ్డి పాల్గొని పి.సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కుల వివక్షకు వ్యతిరేకంగా తన కుటుంబం నుంచే పోరాటాన్ని ప్రారంభించారని తెలిపారు. ధనిక కుటుంబం లో జన్మించినప్పటికీ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణాని కి కృషి చేశారని కొనియాడారు. దక్షిణ భారత్ లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో సుందరయ్య కీలక పాత్ర పోషించారని అన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కూడా సాధారణ జీవనం గడిపి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లేవారని, దేశ సమస్యల పై అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తో చర్చించే వారని పేర్కొన్నారు. నేటి పాలకులు కుల, మత రాజకీయా లతో ప్రజలను విభజిస్తున్నారని విమర్శించారు. తన ఆస్తి మొత్తాన్ని పార్టీకి అంకితం చేసిన మహానేత సుందరయ్య అని, సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతల నిర్మూలన కోసం ఆయన చూపిన మార్గంలోనే పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి పేద కుటుంబా నికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై పనిచేసే

# అతిపెద్ద సంఘం టీయూడబ్ల్యూజే-ఐజేయు

* **సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే దేశంలోనే అతిపెద్ద జర్నలిస్టు యూనియన్ టియుడబ్ల్యుజె ఐజేయు సంఘం అని టీయూడబ్ల్యూజే ఐజేయు సూర్యపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు అన్నారు. గత వారం రోజులుగా ఐ జే యు జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సూర్యాపేట జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో దిశ పత్రిక జర్నలిస్ట్ తండ నాగేందర్, ఇండియన్ క్రానికల్ జర్నలిస్టులు గుంటూరు సంతోష్ చక్రవర్తి, బత్తుల సరిత, అన్వేషనేత్రం జర్నలిస్టు దుర్గం బాలు తదితరులకు సభ్యత్వం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గుర్తింపు ఉన్న జర్నలిస్టు సంఘాలు ఏవో, గుర్తింపు లేని జర్నలిస్టు సంఘాలు ఏవో జర్నలిస్టులు జాగ్రత్త వహించి జర్నలిస్టుల కోసం వాస్తవంగా పనిచేసే అతిపెద్ద సంఘం అయిన టీయూడబ్ల్యూజే ఐజేయు సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో 90% మంది జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే ఐజేయు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో మెజారిటీ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు టి యు డబ్ల్యూ జే ఐ జేయు సంఘానికి చెందినవారే అని, అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్లు అందజేయడానికి దృఢచిత్తంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని వివరించారు. ఎంతో బాధ్యతాయుతంగా, నమ్మకంగా జర్నలిస్టుల పక్షాన నిలబడ్డ తమ యూనియన్ పై కొన్ని యూనియన్ల వారు అర్థరహిత విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఏ యూనియన్ లో ఉంటే తమకు తగిన గుర్తింపు, భద్రత ఉంటుందో జర్నలిస్టులు విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకొని టీయూడబ్ల్యూజే ఐజేయులో సభ్యులుగా చేరాలని డాక్టర్ కృష్ణ బంటు కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే ఐజేయు నాయకులు గుడిపూడి రామకృష్ణ, సుంకర పోయిన వెంకటయ్య, ఉయ్యాల నరసయ్య, కందుల నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 20న మందుల షాపుల బంద్



బషీర్‌బాగ్: హక్కుల సాధన కోసం ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్లడించింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఛాంబర్ ప్రతినిధులు మాట్లాడారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిలిపేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించి నకిలీ మందుల అమ్మకాలను నివారించాలనే డిమాండ్లతో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

**ఆ మెడికల్ స్టోర్లు పనిచేస్తాయ్**

ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్తంగా బుధవారం మందుల దుకాణాలు మూతపడనున్నాయి. అయితే, ప్రధాన ఫార్మసీ చైన్ అవుట్‌లెట్లు, జన ఔషధీ కేంద్రాలు, ఆసుపత్రి కేంద్రంగా పనిచేసే మెడికల్ స్టోర్లు, అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్లు మాత్రం తెరిచే ఉంటాయని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ సమ్మె నుంచి కొన్ని రాష్ట్రస్థాయి ఫార్మసీ సంఘాలు ఇప్పటికే వైదొలిగాయి. పశ్చిమ బెంగాల్, కేరళ పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, లద్దాక్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, ఉత్తరాఖండ్‌కు చెందిన రిటైల్ ఫార్మసీ అసోసియేషన్లు సమ్మెలో పాల్గొనడం లేదని లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చాయి. మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం సమ్మె ప్రభావం కనిపించనుంది.

* **అత్యవసర మందుల కోసం టోల్‌ఫ్రీ**

మెడికల్ దుకాణాల బంద్ నేపథ్యంలో ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక సూచన చేసింది. ఒకవేళ అత్యవసర మందులు దొరకకపోతే స్థానిక డ్రగ్ కంట్రోల్ అధికారిని సంప్రదించాలని సూచించింది. అధికారుల నంబర్లు, అడ్రస్ వివరాలు డీసీఏ వెబ్‌సైట్‌లో కీ కాంటాక్ట్స్ విభాగంలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ప్రజలు ఏదైనా సాయం కోసం డీసీఏ టోల్ ఫ్రీ నంబర్ 1800 599 6969కి కాల్ చేయొచ్చని సూచించింది. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్స్ తెరిచే ఉంటాయని ప్రకటించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు డీసీఏ అన్ని చర్యలూ తీసుకుంటుందని హామీ ఇచ్చింది.

## మౌనిక వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుంది



: **మంచు మనోజ్ ప్రకటన**

- **వచ్చే ఎన్నికల్లో తన భార్య మౌనిక పోటీ చేస్తుందన్న మనోజ్**
- **ప్రస్తుతం తాము రాజకీయాల్లో భాగమయ్యామని స్పష్టీకరణ**
- **'ఐక్య' సంస్థకు రాజకీయాలకు సంబంధం లేదని వెల్లడి**
- **సేవా కార్యక్రమాలకు సొంత నిధులు వెచ్చిస్తానని ప్రకటన**
- **తండ్రితో గొడవలపై సరదాగా స్పందించిన మనోజ్**

టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన భార్య భూమా మౌనిక రెడ్డి రాజకీయ ప్రవేశంపై కీలక ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తుందని వెల్లడించారు. తాము ప్రస్తుతం రాజకీయాల్లో భాగమయ్యామని తెలిపారు. (మే 20న) తన పుట్టినరోజు సందర్భంగా నేడు ఆయన మీడియాతో సమావేశమయ్యారు. ఇటీవలే తాను ప్రారంభించిన 'ఐఖ్య' (AIKYA... Dhairya Sena Samithi) సంస్థపై వస్తున్న సందేహాలకు ఈ సందర్భంగా ఆయన సమాధానమిచ్చారు. 'ఐక్య' అనేది రాజకీయ సంస్థ కాదని, ప్రజల గొంతుకగా ఉండేందుకు దాన్ని ప్రారంభించానని మనోజ్ తెలిపారు. ఈ సంస్థకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'ఐక్య' కార్యకలాపాల కోసం తన సొంత నిధులనే వెచ్చిస్తానని ఆయన వివరించారు. ఈ క్రమంలోనే, తన తండ్రి మోహన్ బాబుతో ఉన్న గొడవలు సద్దుమణిగాయా అని మీడియా ప్రశ్నించగా... "ఆ ప్రశ్న ఎవరిని అడగాలో మీకు తెలుసు. కానీ మైక్‌తో వెళ్లకండి, వెళ్లినా హెల్మెట్ పెట్టుకోండి" అంటూ మనోజ్ సరదాగా వ్యాఖ్యానించారు.

## బండి బగీరథ్ కేసు..

# మరో సిట్ ఏర్పాటు

- **బండి బగీరథ్ బెయిల్ కేసును విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి**
- **ఆమెను లక్ష్యం చేసుకుని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు**
- **తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు**



తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేస్తుందని, న్యాయవ్యవస్థపై జరిగిన ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి వద్దకు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ వేదికగా ఆమెను లక్ష్యంగా చేసుకుని కొన్ని అనుచిత పోస్టులను సర్క్యులేట్ చేశారు. బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా జస్టిస్ మాధవి దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారం న్యాయవ్యవస్థ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం విచారణ జరిపే న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఇలాంటి పోస్టులు పెట్టడంపై దిగ్భ్రాంతి వ్యక్తమైంది. దీనిపై తెలంగాణ న్యాయమూర్తుల సంఘం నేతలు కూడా తీవ్రంగా స్పందించారు. ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సోషల్ మీడియా దాడికి సంబంధించి ఇప్పటికే ప్రధాన నిందితుడైన దామోదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదు చేశారు. జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ఈ పోస్టుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, ఏ ఐటీ సెల్స్ దీనిని వ్యాప్తి చేశాయనే కోణంలో లోతైన దర్యాప్తు ప్రారంభించింది.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి. అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.
- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

#### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



#### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

#### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.



# ఎండల్లో ఇవి చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది.

గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు

**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.



అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# రామ్ చరణ్‌తో తన జోడీని చిరంజీవి-శ్రీదేవి కాంబోతో పోల్చిన జాన్వీ కపూర్





టాకీస్: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న నటి జాన్వీ కపూర్, ముంబైలో సోమవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చరణ్‌తో తన జోడీపై ప్రేక్షకులు పెట్టుకున్న అంచనాల గురించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ మాట్లాడుతూ, "మా ఇద్దరి మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉందని నేను అర్థం చేసుకోగలను. గతంలో చిరంజీవి గారు, మా అమ్మ శ్రీదేవి ఆన్ స్క్రీన్ జోడీని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు మమ్మల్ని వెండితెరపై చూడాలని వారు ఆసక్తిగా ఉన్నారు. ఇంత ప్రత్యేకమైన చిత్రంలో అతడితో కలిసి పనిచేయడం ఒక అద్భుతంలా అనిపించింది. అతడు నిజంగా అత్యుత్తమ వ్యక్తి" అని తెలిపారు.

చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా జాన్వీ ప్రశంసలు కురిపించారు. "మేము రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాం. బుచ్చి గారు చూడటానికి చాలా అమాయకంగా కనిపిస్తారు, కానీ నిజానికి ఆయన అలా కాదు. ఇండియాలోనే ఆయన రౌడీయెస్ట్ డైరెక్టర్. నిజాయతీగా చెప్పాలంటే ఆయన నన్ను ఎన్నో విధాలుగా మార్చారు. నాకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యారు. రోజులో ఒక్కసారైనా ఆయనకు ఫోన్ చేసి మాట్లాడాల్సిందే" అని ఆమె వివరించారు.

ఈ చిత్రంలో దివ్యేందు, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## తిలక్ వర్మతో అఫైర్.. అవాస్తవం

- నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మపై వస్తున్న పుకార్లపై స్పందన
- డేటింగ్ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమని ప్రకటన
- నిజానిజాలు తెలుసుకోకుండా కథనాలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి





టాకీస్: ప్రముఖ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె టీమ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైన, అవాస్తవ కథనాలని అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలీల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది.

"శ్రీలీల, తిలక్ వర్మకు సంబంధించి వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యమైనవి. వారిద్దరూ ఇప్పటివరకు ఒకరినొకరు కనీసం కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. వాస్తవ నిర్ధారణ లేకుండా ఇలాంటి కల్పిత కథనాలను ప్రచారం చేయవద్దని కోరుతున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియా ఖాతాలతో పాటు పాటు కొన్ని మీడియా వేదికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో శ్రీలీల టీమ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యక్తిగత విషయాలపై వార్తలు రాసేటప్పుడు మీడియా, సోషల్ మీడియా యూజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేసింది.

సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ ఇలాంటి పుకార్లు రావడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రచారం ఎక్కువ కావడంతో వెంటనే స్పందించి పుకార్లకు అడ్డుకట్ట వేయాలని శ్రీలీల బృందం నిర్ణయించుకుంది. ఈ అధికారిక ప్రకటనతో శ్రీలీల, తిలక్ వర్మ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.



## నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

### అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎలాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లోట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.



## ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

### జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్‌ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం-యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

**అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

## వైభవ్ విధ్వంసం



**38 బంతుల్లో 93**

**రాజస్థాన్‌కు కీలక విజయం**

**మార్ష్ పోరాటం వృథా**

**జైపూర్:** వరుసగా మూడు ఓటములతో ప్లేఆఫ్స్ బెర్త్ ప్రమాదంలో పడిన వేళ.. రాజస్థాన్ రాయల్స్ అదరగొట్టింది. టీనేజి సంచలనం వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లతో 93) సొంత మైదానంలో పిడుగల్లే విరుచుకుపడ్డాడు. దీంతో మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 7 వికెట్లతో విజయం సాధించింది. ప్రస్తుతం 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరిన రాజస్థాన్ ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే నేరుగా ప్లేఆ?ఫ్సకు వెళ్తుంది. మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), ఇన్‌గ్లి?స (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60), కెప్టెన్ రిషభ్ పంత్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35) ధాటిగా ఆడారు. ఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 225 పరుగులు చేసి గెలిచింది. జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), జైస్వాల్ (23 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా వైభవ్ నిలిచాడు.

**బాదుడే బాదుడు:** భారీ ఛేదనను రాజస్థాన్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. ఓపెనర్ జైస్వాల్ దూకుడును మరో ఓపెనర్ వైభవ్ తుఫాన్‌గా మార్చాడు. బంతి పడిందే ఆలస్యం అన్నట్టుగా సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ నాలుగు ఫోర్లతో 23 రన్స్, నాలుగో ఓవర్‌లో 6,4,4,4తో 19 రన్స్ రాబట్టాడు. అటు ఆరంభంలో నెమ్మదిగా ఆడిన వైభవ్ ఆరో ఓవర్‌లో 6,4,4తో పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులకు చేరింది. ఆ వెంటనే జైస్వాల్ వెనుదిరగగా, వైభవ్ లఖ్‌నవూ బౌలర్లను బెంబేలెత్తించాడు. పేసర్ ఆకాశ్ ఓవర్‌లో 6,4,4,6,2తో 26 రన్స్ అందించిన వైభవ్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు జురెల్ 12వ ఓవర్‌లో 4,6,6, వైభవ్ 6,6లతో ఏకంగా 29 రన్స్ సమకూరాయి. వైభవ్ 93 రన్స్ దగ్గర భారీషాట్‌కు వెళ్లి వెనుదిరగడంతో, రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ప్రిటోరియస్ (7) రనౌటైనా.. జురెల్ అర్ధసెంచరీ సాధించడంతో పాటు ఫెరీరా (16 నాటౌట్) సహకారంతో ఐదు బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

**ఓపెనర్ల దూకుడు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు మార్ష్, ఇన్‌గ్లి?స మెరుపు ఆరంభాన్ని అందించారు. రాజస్థాన్ బౌలర్లకు ఈ జోడీ ఎలాంటి అవకాశాన్ని ఇవ్వకుండా పరుగుల వరద పారించింది. ఓ దశలో 250 స్కోరు కూడా సాధ్యమే అనిపించినా.. డెత్ ఓవర్లలో పుంజుకున్న రాజస్థాన్ బౌలర్లు లఖ్‌నవూ ఆశించిన స్కోరును చేయకుండా అడ్డుకోగలిగారు. తొలి ఓవర్‌లో మార్ష్ 4,6తో జోరు చూపగా.. ఆ తర్వాత ఇన్‌గ్లి?స ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకుని చెలరేగాడు. నాలుగో ఓవర్‌లో 4,4,6తో 16 రన్స్ అందించాడు. దీంతో అతి తక్కువ బంతుల్లోనే (21) లఖ్‌నవూ తమ 50 రన్స్‌ను సాధించింది. ఇక ఐదో ఓవర్‌లో మార్ష్ 4,4,6.. ఆరో ఓవర్‌లో ఇన్‌గ్లి?స 6,4 బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 83 పరుగులతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత 23 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసిన ఇన్‌గ్లిస్‌ను స్పిన్నర్ యష్‌రాజ్ బౌల్డ్ చేశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 49 బంతుల్లోనే 109 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. ఈ దశలో మార్ష్ బ్యాట్ ఝుళిపించాడు. అటు పూరన్ (16)ను కూడా యష్‌రాజ్ అవుట్ చేశాడు. పంత్ రాకతో 13-15 ఓవర్ల మధ్య 16 పరుగులే వచ్చాయి. ఆ తర్వాత ఇద్దరూ వేగం చూపి బౌండరీలు రాబట్టడంతో 18వ ఓవర్‌లో స్కోరు 200 దాటింది. ఆఖరి ఓవర్‌లో ఆర్చర్ ఐదు పరుగులే ఇచ్చి బదోని (0)ని బౌల్డ్ చేయగా.. పంత్, సెంచరీ ముంగిట మార్ష్ రనౌటయ్యారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.